సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 20 । మార్చి । 2023



పదింతల సన్నద్ధం


సరిగ్గా రెండు వారాలే మిగిలింది.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడింది.. ఈ పరీక్షలకు ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. - వివరాలు 8లో▸



ఆహార పానీయాలే ఆరోగ్య నిర్ణేతలు

తినే ఆహారం, తాగే నీరు వ్యక్తి ఆయుష్షును నిర్ణయిస్తాయని ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. - 8లో▸

డెల్టాలకు 5,855 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 5,855 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,730, మధ్య డెల్టాకు 1,125, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.20 అడుగులకు చేరింది.

వైద్యో నారాయణో హరిహరీ..

- నాడి పట్టకుండానే నోట్ల వేట
- వైద్యుడు చూడకుండానే వైద్య పరీక్షలు
- ధన దాహంతో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాకం

■ రావులపాలేనికి చెందిన రాజేశ్వరరావుకు అకస్మాత్తుగా మాట ముద్దగా మారి, తల తిరుగుతూండటంతో మంచి వైద్యుడికి చూపించుకునేందుకు రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రికి వచ్చాడు. రూ.500 ఇచ్చి ఓపీ రాయించుకున్నాడు. అక్కడే బరువు, బీపీ చూసిన సిబ్బంది.. ఆ వివరాలను ఓపీ చీటీలో రాసి, మరో గదికి పంపారు. అక్కడ మరో వ్యక్తి ఇంకో చీటీలో హెచ్‌బీ, సీఆర్‌పీ, లివర్ ఫంక్షన్, ఫుల్ బ్లడ్ కౌంట్, టైడాట్, బ్లడ్ గ్లూకోజ్, కాల్షియం, విటమిన్ టెస్ట్, ఈసీజీ, చెస్ట్ ఎక్స్‌రే వంటి రూ.4 వేల విలువైన పరీక్షలు చేయించుకోవాలని రాసిచ్చారు. అవాక్కయిన రాజేశ్వరరావు 'ఇంకా వైద్యుడు చూడలేదు కదా' అని అడిగితే.. 'ఆయన వచ్చి చూసినా ఈ పరీక్షలు తప్పనిసరి. అప్పటి వరకూ ఉండటం వల్ల మీ సమయమే వృథా అవుతుంది' అని సిబ్బంది బదులిచ్చారు. చేతి చమురు వదిలిపోతోందని బాధ పడుతూ, గత్యంతరం లేక వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ఆయన సంబంధిత విభాగానికి కాళ్లీడ్చుకుంటూ వెళ్లాడు.

■ కడుపు నొప్పితో బాధ పడుతున్న ఓ మహిళ నగరంలోని ఓ గైనిక్ ఆసుపత్రికి వెళ్లింది. అక్కడి సిబ్బంది ముందుగానే స్కానింగ్ చేయించుకోవాలని ఆమెకు చెప్పారు. స్కానింగ్ చేయించుకుని వెళ్లిన ఆ మహిళను వైద్యుడు పరీక్షించి, మరికొన్ని రక్త పరీక్షలు రాసిచ్చారు. ఆమె ఆ పరీక్షలు కూడా చేయించుకుంది. తీరా చూస్తే ఆ రిపోర్టుల ఆధారంగా ఆమెకు వచ్చింది సాధారణ అజీర్తి నొప్పిగా నిర్ధారించి, దానికి అవసరమైనవి, అదనంగా బలానికని చెప్పి మందులు రాసిచ్చి, ఆసుపత్రిలోనే కొనిపించారు.

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): 'వైద్యో నారాయణో హరిః' అని పెద్దలు అన్నారు. ప్రాణ ప్రదాత అయిన వైద్యుడు దేవుడితో సమానమని భావిస్తారు. అయితే ప్రస్తుతం వైద్యం అన్నా, కొంత మంది వైద్యులన్నా రోగులు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దోచుకోవడమే లక్ష్యంగా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దందా సాగిస్తూండటంతో రోగులు బెంబేలెత్తుతున్నారు. ఆసుపత్రిలో అడుగు పెట్టాక ఓపీ చీటీ ఇవ్వడం దగ్గరే దోపిడీ పర్వం మొదలవుతోంది. వైద్య పరీక్షలు, మందుల కొనుగోలులో కూడా ఆయా ఆసుపత్రులు ఆదాయ మార్గాలు వెతుక్కుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో 670 ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. వీటిలో తూర్పు గోదావరిలో 350, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 120, కాకినాడ జిల్లాలో 200 ఉన్నాయి.

ఆరోగ్యశ్రీ ఉన్నా...

పేద, మధ్య తరగతి రోగులు ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డును చూపిస్తే సిబ్బంది ముందుగా రోగ లక్షణాలు నమోదు చేసుకుంటారు. అదే సమయంలో అక్కడి సిబ్బంది ఆ రోగి సమస్య ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాదని చెప్పి రోగి సహాయకులను ముందుగానే భయపెడతారు. దీంతో ధైర్యం కోల్పోయిన రోగి, ఏదోవిధంగా వైద్యం చేయించుకునేందుకు మానసికంగా సన్నద్ధమవుతాడు. రోగిని వైద్యుడు పరీక్షించిన తరువాత ఆసుపత్రి పీఆర్‌ఓలు రోగి సంబంధీకులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తారు. 'నిజానికి మీ కేసు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాదు. డాక్టరు గారు మీ పరిస్థితి చూసి ఏదోవిధంగా ఆరోగ్యశ్రీ వర్తింపజేసేలా ప్రయత్నించమని మాకు చెప్పారు' అంటూ ఈ విషయం ఎక్కడా చెప్పవద్దని నమ్మిస్తారు. ఆ సమయంలో రోగి బంధువులకు ఆ పీఆర్‌ఓ దేవుడిలా కనపడతారు. ముందుగా కొన్ని పరీక్షలు చేయాలని, వాటి ఖర్చులు మాత్రం వారే చెల్లించుకోవాలని సూచిస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోగి బంధువులు అందుకు అంగీకరించడంతో వైద్య పరీక్షల పేరిట దోపిడీ సాగిస్తారు. ఆ తరువాత ఆరోగ్యశ్రీ అప్రూవల్ పేరిట మరో రెండు రోజులు తాత్సారం చేస్తున్నారు.

దళారుల దందా

సాధారణంగా రోగులు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు పెద్దపెద్ద ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా తమకు అందుబాటులో ఉండే ప్రాథమిక వైద్యుల (బీఎంపీ/పీఎంపీ) వద్దకు వెళతారు. వారిలో కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తారన్నది బహిరంగ రహస్యం. వీరు తమ వద్దకు వచ్చే రోగులకు, అనారోగ్య సమస్యలతో సంప్రదించే వారికి ఉచిత వైద్య సలహాలు, మెడికల్ రిప్స్ ఇచ్చే శాంపిల్స్ ఉచితంగా అందజేసి మంచి ముద్ర వేయించుకుంటారు. ఆయా రోగులు, వారి బంధువులు అనారోగ్య సమస్యలతో సంప్రదించినప్పుడు ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. రోగి ఆయా ఆసుపత్రులకు వెళ్లిన సమయంలో ఎవరి ద్వారా వచ్చారో తెలుసుకుని, దళారీగా వ్యవహరించిన సంబంధిత ప్రాథమిక వైద్యుడిని సంప్రదించి, రోగుల ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి, ఆ ప్రకారం, వైద్యం చేసి, బిల్లులు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలా రోగి చెల్లించే బిల్లులో 15 నుంచి 20 శాతం వరకూ ఆయా ప్రాథమిక వైద్యులకు కమీషన్‌గా ప్రైవేటు ఆసుపత్రులు చెల్లిస్తున్నాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవల్లో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ఇటువంటి ఆరోపణలు వస్తున్న ఆసుపత్రులపై స్వయంగా కలెక్టరే ఆకస్మిక తనిఖీలు చేశారు. విచారణ అనంతరం 12 ఆసుపత్రులపై రూ.14 లక్షల వరకూ జరిమానా విధించిన ఘటన నెల రోజుల క్రితం జరిగింది.



ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు ఏం చేయాలంటే..

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని ఆసుపత్రిలోని ఆరోగ్య మిత్ర వద్దకు వెళ్లాలి.
- రోగి వివరాలను నమోదు చేయించుకోవాలి.
- ఆరోగ్య మిత్ర అందుబాటులో లేకపోతే అక్కడి డెస్క్‌లో ఉన్న ఫోన్ నంబర్‌కు వెంటనే తెలపాలి.
- రోగి వివరాలను ఆరోగ్య మిత్ర రిజిస్టర్ చేసిన వెంటనే ప్రాథమిక వైద్య పరీక్షలన్నీ ఉచితంగా నిర్వహించాలి.
- దీనికోసం ఎవరైనా ముందుగా సొమ్ము చెల్లిస్తే ఆసుపత్రి యాజమాన్యాలు విధిగా ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలి. అలా ఇవ్వకుంటే సచివాలయం సిబ్బంది ద్వారా గ్రీవెన్స్‌లో ఆ వివరాలు ఉంచుతారు. తద్వారా ఆ ఆసుపత్రికి పదింతల జరిమానా విధిస్తారు.
- ఎవరికైనా ఆరోగ్యశ్రీలో ఆసుపత్రి యాజమాన్యం నుంచి ఇబ్బందులు తలెత్తితే 104 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

ఆరోగ్యశ్రీ జిల్లాల కో ఆర్డినేటర్ల ఫోన్ నంబర్లు
తూర్పు గోదావరి : 92810 68129
కాకినాడ/డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ : 92810 68130

ఆరోగ్యశ్రీ ఉంటే రూపాయి కూడా ఇవ్వనవసరం లేదు



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే ఆసుపత్రిలో ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వనవరంలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య మిత్రలు కచ్చితంగా ఉంటారు. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకూ వారు చూసుకుంటారు. ఎవ్వరూ దళారులను ఆశ్రయించవద్దు. ఉదాహరణకు ఎవరైనా ఛాతి నొప్పితో వచ్చారనుకోండి. డైరెక్ట్‌గా ఆసుపత్రిలోని కార్డియాలజిస్ట్ చూడరు. అక్కడి ఆరోగ్యశ్రీ మెడికోలు ముందుగా ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా చేస్తారు. అందులో వచ్చిన రిపోర్టులను బట్టి ముందుకు వెళతారు. ప్రాథమిక నిర్ధారణ పరీక్షలన్నీ ఉచితం.

– ప్రియాంక, జిల్లా కో ఆర్డినేటర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

చర్యలు తీసుకుంటాం



రోగిని వైద్యుడు చూడకుండా వేరే వ్యక్తి వైద్య పరీక్షలు రాసివ్వడం చట్టరీత్యా నేరం. ఈవిధంగా ఏ ఆసుపత్రిలో జరిగినా వెంటనే మాకు ఫిర్యాదు చేయండి. దీనిపై ప్రత్యేక ఆపరేషన్ చేపడతాం. ముందుగా ఈ విషయాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దృష్టికి తీసుకువెళ్తాం. వారి సహకారం తీసుకుంటాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

న్యూస్‌రీల్

గంజాయి తరలిస్తున్న ఆరుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలతో ఎస్సై జగన్‌మోహన్

రాజమహేంద్రవరం రూరల్: ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి కథనం ప్రకారం.. ముందుగా అందిన సమాచారం మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్ తన సిబ్బందితో దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ వెనుక ఉన్న ఖాళీ స్థలానికి ఆదివారం చేరుకున్నారు. అక్కడ బొలేరో వాహనం నుంచి కారులోకి గంజాయిని మారుస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారిని విచారించగా ఒడిశాలోని చింతాడ నుంచి తమిళనాడుకు గంజాయి తరలిస్తున్నట్టు తేలింది. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం రాజవరం గ్రామానికి చెందిన బర్ల రాజబాబు, కొప్పు రాంబాబు, కొప్పు సత్తిబాబు, గుండిపాల గ్రామానికి చెందిన యెన్నేటి దుర్గాప్రసాద్, తమిళనాడుకు చెందిన ఆర్.దినేష్‌కుమార్, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పెదపూడి గ్రామానికి చెందిన బొట్టా శివకుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 170 కిలోల గంజాయి, రూ.3.52 లక్షల నగదు, బొలేరో వాహనం, కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలపురం, కడియంలో మునగ నర్సరీలు



కడియంలో సిద్ధమవుతున్న మునగ నర్సరీ

సాక్షి, రాజమహేంద్రవరం: అత్యంత పోషక విలువలున్న మునగ సాగును ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్నారు. ఈ మొక్కను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పరిసరాల్లో పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్న కేంద్ర నిర్ణయాన్ని డ్వామా అధికారులు అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి పథకం ద్వారా మునగ మొక్కల పెంపకానికి గోపాలపురం, కడియం ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో నర్సరీలో కనీసం 10 వేల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విత్తనం, ప్లాస్టిక్ సంచి, మట్టి, ఎరువు, నీరు పట్టి పెంచేందుకు ఒక్కో మొక్కకు రూ.6 చొప్పున ఇవ్వాలని అనుమతులు వచ్చాయి. నర్సరీల నిర్వహణకు అనువుగా విశాలమైన స్థలాలను సైతం ఇప్పటికే ఎంపిక చేశారు. ప్రధాన రహదారి పక్కనే ఖాళీ స్థలం, నీడ, నీటి వసతి ఉన్నచోట ఈ నర్సరీలు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పెంచిన మొక్కలను వర్షాకాలంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారుల పర్యవేక్షణలో స్వయం సహాయక సంఘాలకు ఇవ్వనున్నారు. ఆ మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి, మునగ మొక్కలు అందజేస్తారని డ్వామా పీడీ రామ్‌గోపాల్ తెలిపారు.

ఆసియాలోనే అతి పెద్ద రక్షణ సంస్థ సీఆర్‌పీఎఫ్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ సతీష్‌కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): సీఆర్‌పీఎఫ్ ఆసియా ఖండంలోనే అతి పెద్ద రక్షణ సంస్థ అని 42వ బెటాలియన్ కమాండెంట్ సతీష్‌కుమార్ అన్నారు. లాలాచెరువు సమీపంలోని కార్యాలయంలో సీఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీఆర్‌పీఎఫ్ సేవలందిస్తోందని అన్నారు. దేశ రక్షణలో సీఆర్‌పీఎఫ్ పాత్రను వివరించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ బి.రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ.. చేయాలిక

- పదేళ్లు దాటితే ధ్రువీకరణ తప్పనిసరి
- జిల్లాలో 68 ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ పథకాలు అందాలన్నా, ప్రజలు ఏ లబ్ధి పొందాలన్నా ఆధార్ తప్పనిసరి అయ్యింది. వివిధ సందర్భాల్లో ప్రాథమిక గుర్తింపునకు ఆధార్ కార్డే ప్రస్తుతం దిక్కవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆధార్ కార్డులోని వివరాలను నవీకరించుకోవాలని (అప్‌డేట్) యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆధార్ కార్డు తీసుకుని, పదేళ్లు పూర్తయిన వారు అదే చిరునామాలో ఉన్నప్పటికీ నవీకరణ తప్పనిసరి చేసింది. సగానికి పైగా ప్రజలు పదేళ్లలో ఒక్కసారి కూడా ఆధార్ అప్‌డేట్ చేసుకోలేదని గుర్తించిన యూఐడీఏఐ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ఇప్పటికే ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికీ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆధార్ కార్డుల నవీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధార్‌కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ముఖ్యమైన గుర్తింపు కార్డుల్లో ఒకటిగా చేర్చింది. ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికీ ఆధార్ తప్పనిసరి చేసింది. ఆధార్ కార్డులోని బయోమెట్రిక్ వివరాలే సంబంధిత వ్యక్తుల గుర్తింపునకు రుజువుగా మారాయి.

సచివాలయాల్లో..

ఆధార్ నవీకరణకు, కొత్త ఆధార్ కార్డు తీసుకోవడానికి ఇప్పటికే పలు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలోనూ సచివాలయాల సంఖ్యను బట్టి, ఆధార్ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఆయా సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు ఈ బాధ్యతలు అప్పగించారు.



ఆధార్ నమోదు కేంద్రం పనితీరును పరిశీలిస్తున్న జిల్లా గ్రామ/వార్డు సచివాలయ అధికారి వీణాదేవి (ఫైల్)

నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

ఆధార్ నవీకరణకు సంబంధించి కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 48, కొవ్వూరు డివిజన్‌లో 20 గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ నెల 20, 21, 27, 28, 29 తేదీల్లో షెడ్యూల్ ప్రకారం ఆధార్ సేవలు అందించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆధార్ అప్‌డేట్ కోసం జిల్లాలోని 68 గ్రామ/వార్డు సచివాలయాల్లో సోమవారం నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి.

– వీణాదేవి, జిల్లా గ్రామ/వార్డు సచివాలయాల అధికారి

పేదలకు పెద్ద చదువులు అందించడమే లక్ష్యం

- అందుకే విద్యారంగంలో వివిధ సంక్షేమ పథకాలు
- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- జగనన్న విద్యా దీవెన కింద 32,592 మందికి రూ.23.70 కోట్ల జమ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చదువుకు పేదరికం అడ్డం కారాదనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో జగనన్న విద్యా కానుక వంటి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గత ఏడాది అక్టోబర్ – డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన – ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మార్గాని మాట్లాడుతూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా సీఎం జగన్ పాఠశాలలను ఆధునీకరిస్తూ, మౌలిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. జగనన్న విద్యా దీవెన మూడో త్రైమాసికంగా జిల్లాలోని 32,592 విద్యార్థులకు సంబంధించి 29,125 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం రూ.23.70 కోట్లు జమ చేసిందని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, చదువే పిల్లలకు ఇచ్చే ఆస్తి అని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి విద్యార్థీ ఉన్నత విద్య వరకూ చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తూ, అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ అధికారులు జి.జనార్దన రావు, కె.జ్యోతి, పి.సత్య రమేష్, వివిధ కళాశాలల విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.



డెమో చెక్‌ని అందిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత

జగనన్న విద్యా దీవెన నియోజకవర్గాల వారీగా అందిందిలా..

నియోజకవర్గం	విద్యార్థులు	తల్లులు	లబ్ధి (రూ.కోట్లలో)
అనపర్తి	3,467	3,094	2.33
రాజానగరం	4,066	3,922	2.65
రాజమహేంద్రవరం రూరల్	5,033	3,675	2.76
రాజమహేంద్రవరం సిటీ	6,060	5,427	4.35
గోపాలపురం	3,808	3,706	3.00
కొవ్వూరు	4,223	3,757	3.26
నిడదవోలు	5,066	4,489	3.90
జగ్గంపేట (గోకవరం మండలం)	811	741	రూ.46 లక్షలు
రంపచోడవరం (ఎస్టీలకు – గోకవరం మండల పరిధి)	58	52	రూ.3.57 లక్షలు

చంద్రమౌళీశ్వరునికి వైభవంగా త్రికాలార్చన



శ్రీవారి క్షేత్రంలో శంకర విజయేంద్ర సరస్వతి

దేవరపల్లి: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి ఆలయంలో ఏర్పాటు చేసిన పీఠంలో చంద్రమౌళీశ్వరస్వామికి, మహాత్రిపురసుందరి అమ్మవారికి కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆదివారం వైభవంగా త్రికాలార్చన నిర్వహించారు. చంద్రమౌళీశ్వరస్వామికి ఉదయం అభిషేకం, విశేష పూజలు చేశారు. తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామీజీని దర్శించుకుని, ఆశీర్వాదం అందుకున్నారు. స్థానిక పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారికి కూడా స్వామీజీ పూజలు చేశారు.

ఇదేం పరీక్షరా నాయనా!

- నన్నయ వర్సిటీ ప్రశ్నపత్రాల్లో తప్పులు
- డిగ్రీ ఐదో సెమిస్టర్ విద్యార్థులకు తిప్పలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న డిగ్రీ ఐదో సెమిస్టర్ ప్రశ్నపత్రాల్లో చోటు చేసుకున్న తప్పులు తమకు ముప్పు తెస్తాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. శనివారం జరిగిన గణితం ప్రశ్నపత్రంలో ఒకదానిపై ఒకటి ముద్రపడి (ఓవర్‌లాప్) కొంత గందరగోళం ఏర్పడిన సంగతి విదితమే. అయితే గణితంతో పాటు మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ప్రాక్టీస్ ప్రశ్నపత్రంలోనూ తప్పులు దొర్లాయని వివిధ కళాశాలల ప్రతినిధుల నుంచి అందిన సమాచారం ద్వారా తెలుస్తోంది. ఇంగ్లిష్‌లో ఇచ్చిన ప్రశ్నలను తెలుగులోకి గూగుల్ ద్వారా అనువదించడంతో అసలైన అర్థాలు మారిపోయాయి. 12వ ప్రశ్నలో ఒక కంపెనీ అకౌంటింగ్‌కి సంబంధించి స్టేట్‌మెంట్ తయారు చేయమని అడిగిన ప్రశ్నలో ఇంగ్లిష్, తెలుగు పదాలకు అర్థాలు లేకుండా పోయాయి. (ఉదాహరణకు అకౌంటింగ్‌లో క్యాపిటల్ అంటే మూలధనం అని అర్థం. కానీ ప్రశ్నపత్రంలో రాజధానిగా ఇచ్చారు. ఇలా ఎన్నో ఉన్నాయి). 10 మార్కుల ప్రశ్నలు 9లో ఏ లేదా బి, 10లో ఏ లేదా బి, 11లో ఏ లేదా బిగా చాయిస్ ఇవ్వాల్సి ఉండగా, వరుసగా 10 ప్రశ్నలు ఇచ్చి వాటిలో ఐదింటికి జవాబు రాయాలని పేర్కొన్నారు. అలాగే 4వ సెమిస్టర్ ఇన్‌కంటాక్స్ పేపరులో కూడా 10 మార్కులకు 5 లెక్కలు/ప్రశ్నలు ఇవ్వాల్సి ఉండగా యూనివర్సిటీ మోడల్ పేపరు ప్రకారం రెండు లెక్కలు/ప్రశ్నలే ఇచ్చారు. పరీక్షలంటేనే హడలిపోయే విద్యార్థులకు ఇది మరింత గందరగోళం కలిగిస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పరిశీలిస్తాం

ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రశ్నల్లో చాయిస్ ఇస్తున్నాం. 2020 బ్యాచ్ వరకే తెలుగు మీడియంలో పరీక్షలు రాసేవారు. 2021 నుంచి అంతా ఇంగ్లిష్ మీడియమే. ఒకే ప్రశ్నను ఇంగ్లిష్, తెలుగులో ఇచ్చే సందర్భంలో అనువాదంలో వస్తున్న తప్పుల గురించి మాకు ఇంతవరకూ ఎటువంటి ఫిర్యాదూ రాలేదు. అయినప్పటికీ ఈ విషయం పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటాం. ఎ లేదా బి విధానానికి బదులుగా 10 ప్రశ్నలిచ్చి, వాటిలో ఐదింటికి జవాబు రాయమనడం వలన విద్యార్థులకు ఎక్కువ చాయిస్ లభిస్తుంది. అయినా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాను.

– ఎస్.లింగారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

18.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ 18.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లో 23.2, కొవ్వూరు డివిజన్‌లో సరాసరి 13.7 మిల్లీమీటర్ల చొప్పున సరాసరి వర్షపాతం నమోదైంది. కోరుకొండ మండలంలో అత్యధికంగా 61.4, కనిష్ఠంగా నల్లజర్లలో 3.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో చేతి అందే దశలో ఉన్న పొద్దుతిరుగుడు, మినుము పంటలకు 22 హెక్టార్లలో పాక్షిక నష్టం వాటిల్లింది. గోకవరం మండలం కొత్తపల్లిలో 2 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, కోరుకొండ మండలం జగన్నాథపురంలో 5, బుచ్చెంపేటలో 15 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మండలాల వారీగా వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో.. కోరుకొండ 61.4, తాళ్లపూడి 44.2, సీతానగరం 26.4, గోకవరం 24, రాజమహేంద్రవరం అర్బన్ 20.6, రాజమహేంద్రవరం రూరల్ 22.4, రాజానగరం 18.4, రంగంపేట 12.4, బిక్కవోలు 17.6, అనపర్తి 7.8, కడియం 21.2, గోపాలపురం 20.2, కొవ్వూరు 14.6, నిడదవోలు 14.2, దేవరపల్లి 7.4, ఉండ్రాజవరం 4.2, పెరవలి 5.8.

క్రైం కార్నర్

11 మందిపై కుక్క దాడి


అనపర్తి ఏరియా ఆసుపత్రిలో కుక్క కాటు బాధితులు

అనపర్తి: అనపర్తిలో ఓ వీధి కుక్క 11 మందిపై దాడి చేసింది. ఆదివారం ఇక్కడ జరిగిన వారపు సంతకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చారు. ఈ క్రమంలో స్థానిక గరల్స్ హైస్కూల్ రహదారిలో వెళ్తున్న వారిపై ఓ శునకం దాడి చేసి గాయపరిచింది. ఇందులో మండలంలోని రామవరం, లక్ష్మీనరసాపురం, అనపర్తి శివారు కొత్తూరు, అనపర్తికి చెందిన సుమారు 11 మంది గాయపడ్డారు. ఐదుగురు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరగా మిగిలిన వారు వైద్య సేవలు పొంది తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

వ్యక్తి ఆత్మహత్య


కళ్లేపల్లి ప్రేమ్‌రాజు (ఫైల్)

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై తలపెట్టి కళ్లేపల్లి ప్రేమ్‌రాజు (39) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణానికి చెందిన ఆయన గతంలో ఇసుక నిర్వహణ సంస్థలో జిల్లా ఇన్‌చార్జిగా పనిచేశారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీధర్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక ఒత్తిడిలు కారణంగానే అతను మృతి చెందినట్లు ప్రాథమికంగా తెలుస్తుంది. మృతుడికి తండ్రి, సోదరుడు, సోదరి ఉన్నారు. కొంత కాలం కిందట తల్లి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

పదింతల సన్నద్ధం

- పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు
- హై సెక్యూరిటీ జోన్లుగా పరీక్ష కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో 77,085 మంది విద్యార్థులు



రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడింది.. సరిగ్గా రెండు వారాలే మిగిలింది.. ఈ పరీక్షలకు ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా విద్యా శాఖ పటిష్ట చర్యలు చేపడుతుంది. ఏప్రిల్ 3న ప్రారంభమై 18వ తేదీతో ముగియనున్న పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవసరమైన అన్ని ఏర్పాట్లూ చకచకా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1,205 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 77,085 మంది పది పరీక్షలకు హాజరు కానున్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని 62 మండలాల్లోని 373 పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 26,129, కాకినాడ జిల్లాలో 29,988, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20,968 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సీఎస్, డీవోల నియామకం పూర్తి

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీవో) నియామకం ఇప్పటికే పూర్తి చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారికి ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను కాకినాడ జిల్లాలో ఈ నెల 16న ఆర్జేడీ, డీఈఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 21న తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల సీఎస్, డీవోలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సీఎస్, డీవోలతో పాటు ఇన్విజిలేటర్లు, రూట్ అధికారులు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. పరీక్ష కేంద్రాలను హై సెక్యూరిటీ జోన్లుగా గుర్తిస్తున్నారు. గతంలో పది పరీక్షల నిర్వహణకు సీఎస్‌కు సెల్‌ఫోన్‌ను అనుమతించేవారు. పరీక్ష పేపర్ల లీకేజీ, మాల్ ప్రాక్టీస్‌కు తావులేని విధంగా ఇన్విజిలేటర్లతో పాటు సీఎస్, డీవోల వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అవకాశం లేదు.

హాల్ టిక్కెట్లు సిద్ధం

ఇప్పటికే పరీక్షలకు హాల్ టిక్కెట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలకు 20 రోజుల ముందుగానే హాల్ టిక్కెట్లను సిద్ధం చేసి ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను జిల్లాలు, పాఠశాలల వారీగా వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. విద్యార్థులు తమ వివరాలతో హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్‌పై సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు అటెస్టేషన్ చేయించుకున్న తర్వాత మాత్రమే పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది.

ఏడు అంకెలతో ప్రత్యేక కోడ్

ప్రశ్నపత్రం లీక్ కాకుండా ప్రభుత్వ పరీక్షల విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పేపర్‌ను ఎవరైనా లీక్ చేస్తే, అది ఏ సెంటర్ నుంచి లీక్ అయ్యిందో క్షణాల్లో తెలుసుకునేందుకు ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్‌ను ముద్రిస్తారు. పేపర్‌ను లీక్ చేసిన వారిని వెంటనే గుర్తించేందుకు విద్యాశాఖ ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. విద్యార్థులకు ఓఎంఆర్ షీట్, సమాధానాలు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. 24 పేజీల బుక్‌లెట్‌కు మించి సమాధానాలు రాస్తే అదనంగా 12 పేజీల బుక్‌లెట్‌ను కూడా ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీస్‌గా పరిగణించే విధంగా కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారు.

జిల్లా	పాఠశాలలు	రెగ్యులర్	ప్రైవేట్	మొత్తం
తూర్పు	381	22,732	3,397	26,129
కాకినాడ	454	27,516	2,472	29,988
కోనసీమ	370	19,084	1,883	20,968

చిన్న పొరపాటూ జరగకుండా..



పది పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతుంది. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డీఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా పరీక్షలను నిర్వహిస్తాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ఏర్పాట్లలో నిమగ్నం



పది పరీక్షల్లో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో కూర్చుని పరీక్షలు రాసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ, కాకినాడ

సదుపాయాలకు ప్రాధాన్యం



పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్ వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాం.

–ఎం.కమలకుమారి, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సెల్‌ఫోన్ అనుమతించం



పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు ఏ మాత్రం అవకాశం లేని విధంగా చర్యలు తీసుకుంటున్నాం. సీఎస్, డీవోలకు కూడా సెల్‌ఫోన్ అనుమతించే ప్రసక్తి లేదు. గతేడాది మాదిరిగానే పరీక్షల సమర్థవంత నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.అబ్రహం, డీఈఓ, తూర్పుగోదావరి

ఆహార పానీయాలే ఆరోగ్య నిర్ణేతలు

- నిల్వ పదార్థాలే అనారోగ్య హేతువులు
- విశిష్ట వక్త డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- ఐఎంఏ ఆధ్వర్యంలో రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్

కాకినాడ క్రైం: తినే ఆహారం, తాగే నీరు వ్యక్తి ఆయుష్షును నిర్ణయిస్తాయని ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, ప్రతిష్టాత్మక ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డుల గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యాన ఆదివారం జరిగిన రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్ విజయవంతమైంది. ఐఎంఏ కాకినాడ అధ్యక్ష, కార్యదర్శులు మోకా పవన్‌కుమార్, చిట్ల కిరణ్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, సెక్రటరీలు గురుప్రసాద్, ఆర్ఎస్ జవహర్ సారథ్యంలో జరిగిన ఈ సదస్సుకు ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు శరద్‌కుమార్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జీ హాజరయ్యారు. వారితో పాటు నాగేశ్వర్‌రెడ్డి హాజరై విశిష్ట వక్తగా ప్రసంగించారు. 'జీవితంలో విజయవంతం కావడం', 'గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య రంగంలో తాజా పురోగతులు' అనే అంశాలపై చర్చించారు. అందరూ భావిస్తున్నట్లు ఫాస్ట్ ఫుడ్స్ దేహానికి హానికారకం కాదని వాటి రంగు, రుచి, వాసనను పెంచేందుకు, నిల్వ ఉంచేందుకు కలిపే సంకలనాలే తీవ్ర అనారోగ్యాలు, అధిక బరువుకు కారణమవుతున్నాయని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కేవలం ఆహారపు అలవాట్ల కారణంగా వయసుతో నిమిత్తం లేకుండా రోగాల బారిన పడి ఎందరో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో ఈ సంఖ్య పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా వాడే యాంటీబయోటిక్స్, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలు శరీరంలో అంతర్గతంగా ఉన్న సూక్ష్మ జీవ వ్యవస్థ (మైక్రోబయాలజీ) పనితీరులో ప్రతికూల మార్పులకు కారణమవుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన ఆరేళ్లలో చోటుచేసుకున్న మంచినీటి సరఫరా విధానంలో విప్లవాత్మక మార్పుల కారణంగా ఎన్నో అనారోగ్యాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. చిప్స్, నూడుల్స్‌తో పాటు ఇతర రసాయన సంకలనాలు కలిగిన ఆహారాల వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్, క్రోన్స్ డిజీస్‌తో పాటు అల్సరేటిక్ కొలైటిస్ సర్వసాధారణమైపోయాయని నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సమయ పాలన, ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేయడం, లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, తగిన ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయడం ద్వారా జీవితంలో విజయవంతం కావొచ్చన్నారు. ఈ అకడమిక్ సదస్సులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పూర్వపు వీసీ ఐవీ రావుతో సహా డాక్టర్లు కాదా వెంకటరమణ, సోమయాజులు, టీఎల్ఎన్ ప్రవీణ్, నరసింహన్, రామ్మోహన్ తదితరులు మెడిసిన్, సర్జరీ, ప్రసూతి, రేడియాలజీ అంశాలపై మాట్లాడారు. సదస్సులో ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కళ్యాణ్ చక్రవర్తి, ఐఎంఏ కాకినాడ ఫైనాన్స్ సెక్రటరీ ఎస్‌సీహెచ్‌ఎస్ రామకృష్ణ, కార్యక్రమ ఆర్గనైజింగ్ సభ్యులు ఎంవీ ఆనంద్, వాడ్రేవు రవి, లక్ష్మీనారాయణ, బి.అనురాధ, ప్రముఖ గైనికాలజిస్టు ఏఎల్ సత్యవతి పాల్గొన్నారు. జిల్లాతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన 800 మంది వైద్యులు హాజరయ్యారు.


సదస్సులో పాల్గొన్న వైద్యులు



గ్యాస్ట్రో ఎంట్రాలజీలో పురోగతులను వివరిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

సాటి జీవిని ఆదరించడమే నిజమైన ఉగాది


నటుడు నారాయణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి
- ఆయనకు గోదావరి ఆణిముత్యం అవార్డు ప్రదానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కుల మతాలను పక్కన పెట్టి సాటి మనుషులను ఆదరించడమే నిజమైన ఉగాది పండుగ అని సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. శ్రీశోభకృత్ నామ ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని రోటరీ క్లబ్ సెమినార్ హాల్‌లో ఫిలాంత్రోపిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కార మహోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఉభయ రాష్ట్రాలకు చెందిన 30 మందిని పురస్కారాలతో సత్కరించారు. గోదావరి ఆణిముత్యం పురస్కారంతో ఆర్.నారాయణ మూర్తిని సత్కరించి గోదావరి మాత ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి తొలి పండుగ ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తోటివారికి సాయపడాలనే భావన అలవర్చుకోవాలని హితవు పలికారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిళ్ళంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉగాది అందరికీ శుభాలు చేకూర్చాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడిపూడి సత్యశైలజ, కేంద్ర సాహిత్య సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్పీ భారతి, పిఠాపురం సంస్థాన రాజవంశీకులు రాజారావు వెంకటమహిపతి రామరత్నారావు బహదూర్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బస్సు బోల్తా

ఆరుగురికి గాయాలు


తుని వద్ద బోల్తా పడిన ఆర్టీసీ బస్సును క్రేన్‌తో బయటకు తీస్తున్న దృశ్యం

తుని: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూతవేటు దూరంలో ఆదివారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. తుని పట్టణ పోలీసులు, ప్రయాణికుల కథనం ప్రకారం .. విజయవాడ నుంచి పార్వతీపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు తుని జాతీయ రహదారి సీతారాంపురం జంక్షన్ సమీపంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళుతున్న సర్వీస్ రోడ్డు లో బోల్తా పడింది. తెల్లవారుజాము కావడంతో అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. బస్సు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారడంతో అదుపు తప్పి ఈ ఘటన జరిగింది. దీంతో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం తుమరాడకు చెందిన వి.కల్యాణి, వై.సింహాచలం, ఎ.సాంబశివరావు, ఎస్.అప్పన్న, విశాఖపట్నానికి చెందిన ఎం.అయ్యాంగార్, రామలక్ష్మి గాయపడ్డారు. పెద్ద శబ్దం రావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న కొందరు సంఘటన స్థలానికి చేరు కుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడి రాజా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, సత్యనాగేశ్వరరావులు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును యథాస్థితికి తీసుకువచ్చారు. ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు.

గోదావరిలోకి దూకిన యువకులు..?

కొవ్వూరు: స్థానిక రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ఇద్దరు యువకులు ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో గోదావరిలోకి దూకారు. ఈ ఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్సై డి.భూషణం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వంతెనపై నుంచి ధవళేశ్వరం బ్యారేజీ వైపు దూకినట్లు చూసిన వారు చెప్పారు. స్థానిక మత్స్యకారుల సాయంతో గోదావరిలో గాలిస్తున్నారు. అంతా గుమిగూడడంతో వంతెనపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

వైభవంగా వెంకన్న అధ్యయనోత్సవాలు


వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి తీర్థం, కల్యాణోత్సవాలకు ముందు అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు, ఆలయ అర్చకులు వేద పారాయణ చేశారు. అనంతరం స్వామివారిని పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఆలయ ఆవరణలో స్వామివారి అధ్యయనోత్సవాల విరామం సమయంలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారి అష్టోత్తర పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

కవిత వినిపించి.. ఓలలాడించి..


కొత్తపేట ఉగాది సాహితీ సభలో పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు, కళాకారులు

- ఆకట్టుకున్న ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం
- అద్దంకి కేశవరావు, పలువురు కవుల రచనల ఆవిష్కరణ

కొత్తపేట: ఉగాదికి ముందే కవులకు కొత్తపేట వేదికైంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ కవితా గానాలతో శ్రోతలను ఓలలాడించారు. కొత్తపేటలో కళాసాహితి ఆధ్వర్యంలో ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ఎంవీఎస్ సుబ్బరాజు కల్యాణ మండపంలో జరిగిన సభకు కళాసాహితి అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు అధ్యక్షత వహించగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ ముఖ్య అతిథిగా, అంతర్జాతీయ శిల్పి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డి.రాజ్‌కుమార్ వుడయార్, ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. దివంగత కవి, అభినవ పోతన, పద్య కవితాభూషణ అద్దంకి కేశవరావు 50వ దశకంలో రచించిన అశోకుడు ఏకపాత్ర, గౌతమ కళ్యాణం నృత్య రూపకం పుస్తకాలను, కవి నేలపూడి రత్నాజీ రాసిన రాజ్యమేలే తాళంచెవి పుస్తకాన్ని కళాసాహితి ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు ఆవిష్కరించారు. కవి మధునాపంతుల సత్యనారాయణ రాసిన ఝాన్సీ మజిలీ కథలు పుస్తకాన్ని రెంటాల ఆవిష్కరించారు. సామాజిక స్పృహతో రాసే కవిత్వం సజీవం సామాజిక స్పృహతో కవిత్వం రాస్తే అది సమాజంలో ఎప్పుడూ సజీవంగా ఉంటుందని కత్తిమండ ప్రతాప్‌కుమార్ అన్నారు. కవిత్వం ఎప్పటికప్పుడు కొత్త కోణాలను ఆవిష్కరించాలని, కవి భవిష్యత్ నిర్దేశకుడు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 60 మంది కవులు తమ కవితల ద్వారా ప్రస్తుతం దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక పోకడలపై విమర్శలు, సద్విమర్శలు సంధించారు. 35 ఏళ్లుగా సాహితీ సేవ చేస్తున్న జి.సుబ్బారావును, పాల్గొన్న ప్రముఖులు, కవులు, రచయితలను శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. విందు ఏర్పాటు చేసిన కేశవరావు కుమార్తె రిటైర్డ్ హెచ్‌ఎం అద్దంకి బాలాత్రిపురసుందరికి సభ కృతజ్ఞతలు తెలియజేసింది. సీనియర్ జర్నలిస్టు టి.వేణుగోపాలరావు (హైదరాబాద్), సాహితీవేత్తలు, కవులు డాక్టర్ టీఎస్ నారాయణ, డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, బొల్లోజు బాబా, మార్ని జానకిరామ్‌చౌదరి, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తొండంగి: బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన బాబూ జగ్జీవన్‌రామ్‌కు ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మండలంలోని రావికంపాడు ఎస్సీ కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాదిగ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతపూడి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రచించిన బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌లు దళితులకు రెండు కళ్లు లాంటి వారన్నారు. చిన్న వయసులోనే జగ్జీవన్‌రామ్ మహాత్మా గాంధీజీతో కలసి భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా సుదీర్ఘ కాలం పాటు జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాకాడ గంగారావు, ఇందుగపల్లి వీరబాబు, సగరపు సత్తిబాబు, వల్లూరి ఏసు పాల్గొన్నారు.